క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మామిడికుదురు: కరవాక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 20 మందికి రాజోలు రోటరీ క్లబ్ సభ్యుడు దార్ల పెదబాబు గురువారం స్టడీ మెటీరియల్ అందించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏడిద కవీంద్ర అభిలషించారు. కార్యదర్శి లక్ష్మణరావు, మహ్మద్ మొహిద్దీన్, కసుకుర్తి రామకృష్ణ, హెచ్ఎం సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపునాడు నూతన కార్యవర్గాల ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అధ్యక్షుడు కొండలరావు

మామిడికుదురు: కాపుల అభ్యున్నతికి సమష్టిగా పోరాటం చేయాలని కాపునాడు జిల్లా అధ్యక్షుడు రేకపల్లి సురేష్, పి.గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్ముల కొండలరావు పిలుపునిచ్చారు. పాశర్లపూడిలో గురువారం కొండలరావు అధ్యక్షతన జరిగిన కాపునాడు జిల్లా సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల కాపునాడు నూతన కార్యవర్గాల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందించారు. సమావేశంలో కాపునాడు ప్రతినిధులు గుల్లింక గంగాధర్, పెమ్మాడి వీరాస్వామి, కుంపట్ల సూరిబాబు, వీధి సత్తిబాబు, పేరాబత్తుల కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఓ, ఓపీఓలకు అవగాహన

అయినవిల్లి: ఎన్నికల నేపథ్యంలో పీఓ, ఓపీఓలకు పి.గన్నవరం ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో మహిళా పీఓ, ఓపీఓలకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సదస్సు స్థానిక తహసీల్దార్ ప్రమద్వర ఆధ్వర్యంలో జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల బూత్‌లో విధులను వివరించారు. వీవీ ప్యాట్, మాక్‌పోలింగ్ కోసం వివరించారు. ఎన్నికల నిర్వాహణ నమూనా వివరించారు. ఎన్నికల నిర్వాహణపై జి.సాయి శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తొలి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ఆలమూరు: బ్రహ్మాండ దేవుడి తొలి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు గురువారం మండలంలోని చింతలూరులో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామమంతా గోవిందనామ స్మరణతో మార్మోగిపోయింది. తిరుమల తిరుపతి తరహాలో వ్యయ ప్రయాసల కోర్చి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తొలుత వేంకటేశ్వర పతాకావిష్కరణ చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఈ బ్రహ్మోత్సవాలను తిలకించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అల్లంరాజు భరణి నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద భక్తుల కోసం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భారీ బందోబస్తు ఏర్పాటు జరిగింది.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత మృతి



సోంపల్లి సత్యనారాయణ

రాజోలు: స్థానిక కొత్త వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత సోంపల్లి సత్యనారాయణ (76) గుండెపోటుతో విజయవాడలో మృతి చెందారు. రాజోలులోని కోళ్ల వారి వీధిలో ఆయన భౌతిక కాయాన్ని స్థానిక ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం రాజోలు వశిష్టా నదీ తీరంలోని కైలాసభూమిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రాజోలుకు చెందిన ఆయన గత కొన్నేళ్లుగా విజయవాడలో గోదావరి ఎంటర్‌ప్రైజెస్ ద్వారా పలు వ్యాపారాలు నిర్వహించి వ్యాపారవేత్తగా పేరుగాంచారు. స్వగ్రామం రాజోలులో వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని నిర్మించి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేవారు. ఆయన మృతికి రాజోలు పుర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో రాజప్ప, రాజేష్ పూజలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని టీడీపీ పెద్దాపురం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ పి.గన్నవరం అభ్యర్థి సరిపెల్ల రాజేష్‌కుమార్ వేర్వేరుగా గురువారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించడానికి వచ్చిన వీరికి స్థానిక పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామికి విశేష పూజలు చేశారు. రాజేష్‌కుమార్ అయినవిల్లిలో ఉన్న అంబేడ్కర్, రంగా విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం

- 12,845 మందికి సహాయం
- రూ.2.16 కోట్లు జమ



మామిడికుదురు: పేద, అట్టడుగు వర్గాలకు చెందిన రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ రైతు భరోసా పథకం రైతులకు ఎంతో అండగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఏడాదికి మూడు విడతలుగా అధికారం చేపట్టిన నాటి నుంచి ఆర్థిక సహాయం అందిస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయంతో లక్షలాది మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు. గతంలో రైతులు పంట సాగు కోసం పెట్టుబడుల రూపేణా అప్పులు తీసుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం రైతులకు పెట్టుబడి పెట్టేందుకు దోహదపడుతోంది. రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి మూడు విడతల్లో రూ.12,500 ఆర్థికసాయం అందజేస్తున్నారు. సార్వా, దాళ్వా సీజన్ల ప్రారంభానికి ముందే ఆర్థిక సహాయం అందిస్తూ రైతులకు ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది. వ్యవసాయం దండగ కాదు పండగ అనే విధంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందజేస్తోంది. కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం ద్వారా సహాయం అందిస్తూ రైతులకు ఎంతో మేలు చేస్తోంది.

మూడు నియోజక వర్గాల వారీగా గణాంకాలు..

నియోజకవర్గం	రబీ రైతులు	వడ్డీ రాయితీ	ఖరీఫ్ రైతులు	వడ్డీ రాయితీ	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
పి.గన్నవరం	3,043	47.389	1,478	25.844	4,521	73.233
రాజోలు	1,571	30,192	1,315	18.172	2,886	48.364
కొత్తపేట	2,483	41.821	2,959	52.442	5,442	94.435

12,845 మందికి సహాయం

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 12,845 మంది రైతులకు బుధవారం వడ్డీ రాయితీ సహాయం అందింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. వైఎస్సార్ వడ్డీ రాయితీ పథకం ద్వారా మొత్తం రూ.2.16 కోట్ల సహాయం అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఈ తరహాలో రైతులకు ఆర్థిక సహాయం అందించిన దాఖలాలు లేవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం అండగా నిలుస్తోంది



వైఎస్సార్ వడ్డీ రాయితీ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగపడుతోంది. ఈ మొత్తాన్ని పంట పెట్టుబడిగా వినియోగించుకుని వ్యవసాయం చేసుకుంటున్నాం. ఈ పథకం ద్వారా ప్రతి రైతు ఎంతో ఆనందంగా ఉన్నాడు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఏ విధమైన ఆటంకం లేకుండా బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయడం చాలా ఆనందంగా ఉంది.

– చిల్లే వెంకటేశ్వరరావు, మగటపల్లి

క్రమం తప్పకుండా సహాయం



ఏటా రైతు భరోసా, వడ్డీ రాయితీ సొమ్ములు అందుతున్నాయి. ఈ సహాయం పంటల సాగుకు ఎంతో అండగా నిలుస్తోంది. ఖరీఫ్‌తో పాటు రబీ సాగులో సైతం విత్తనాల నుంచి ఎరువులు, పురుగు మందుల వరకు ప్రభుత్వం అందించే సహాయం పెట్టుబడిగా సరిపోతుంది. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా సాఫీగా వ్యవసాయం చేసుకుంటున్నాం.

– మోసుగంటి ఆనందరావు, పెదపట్నం

అప్పులు చేయాల్సిన పరిస్థితి లేదు



గతంలో పంట పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. పంట పండించగా వచ్చిన ఆదాయం అంతా అప్పులు, వడ్డీకి సరిపోయేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ రైతు భరోసా, వడ్డీ రాయితీ అమలు చేయడం వల్ల అప్పులు చేయాల్సిన పరిస్థితి లేదు. ప్రభుత్వం అందించే సహాయంతో పంటలు సాగు చేసి ఆదాయం ఆర్జిస్తూ సుఖంగా జీవనం సాగిస్తున్నాం.

– వానరాశి ప్రభాకరరావు, నగరం

విద్యుత్ ఫ్యూజు బాక్స్ సరిచేశారు



మాచవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఫ్యూజు క్యారియర్ బాక్స్

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: మాచవరం భారతీ కాన్వెంట్‌కు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభానికి ప్రమాద భరితంగా ఉన్న ఫ్యూజు క్యారియర్ బాక్స్‌ను విద్యుత్ శాఖ అధికారులు సరిచేశారు. గత నెల 29న ప్రమాద భరితంగా విద్యుత్ ఫ్యూజు బాక్స్ అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వెలువడింది. దాంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించి ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ ఫ్యూజు క్యారియర్ బాక్స్‌ను ఆ స్తంభానికి ఎత్తులో ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే ప్రభుత్వం



పార్టీలో చేరిన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు



స్టాలిన్‌బాబును సత్కరిస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి మళ్లీ అధికారం చేపడుతుందని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మానేపల్లి శివారు చినకందాలపాలెంలో విప్పర్తి సమక్షంలో పలు కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు విప్పర్తి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ పితాని చంద్రకళ, యన్నాబత్తుల నాగభూషణం, చిట్టూరి రవి, పితాని సురేష్, గుబ్బల సత్యనారాయణ, గురజాపు సూర్యనారాయణ, కవురు సాయిబాబు, నాగరాజు, అడ్డగళ్ల శ్రీను, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విప్పర్తిని కలసిన స్టాలిన్‌బాబు

ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబు బుధవారం పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్టాలిన్‌బాబును విప్పర్తి దుశ్శాలువాతో సత్కరించారు. పార్టీ విజయం కోసం కలసి పనిచేద్దామని విప్పర్తి అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు స్టాలిన్‌బాబును అభినందించారు.

స్టాలిన్‌కు అభినందనలు

అంబాజీపేట: ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన నేలపూడి స్టాలిన్‌బాబుకు ఎంపీపీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. అంబాజీపేటలో స్టాలిన్ నివాసం వద్ద పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే గ్రామాల ప్రగతి



గుడిమూలలో తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే గ్రామాల ప్రగతి అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం రామేశ్వరం, గుడిమూలల్లో జల్‌జీవన్‌మిషన్(జేజేఎం) లో రూ.31.70 లక్షలతో నిర్మించిన రెండు తాగునీటి సరఫరా ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రామేశ్వరంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. వాటి ప్రారంభోత్సవ శిలాఫలకాలనూ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఎంపీటీసీ దొండపాటి సునీత, మహిళా నాయకురాలు పెదపాటి నాగలక్ష్మి, సర్పంచ్‌లు దెందుకూరి శ్రీహరిరాజు, కట్టా ఉమామహేశ్వరరావు, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ గణపతి ఆలయ ప్రతిష్ఠ



మామిడికుదురులో నిర్వహిస్తున్న శాంతి కల్యాణం

మామిడికుదురు: స్థానిక వాసంశెట్టివారిపాలెం హైస్కూల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయం విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మాఘ బహుళ పంచమి 9.50 గంటలకు స్వాతి నక్షత్రయుక్త మేష లగ్నంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. వాసంశెట్టి సత్యనారాయణమూర్తి అతని కుమారుడు వెంకటరమాకాంత్‌బాబు, కవిత దంపతులతో ఈ పూజలను ఘనంగా జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణమూర్తి, మట్టపర్తి త్రిమూర్తులు, గంగారత్నం దంపతులు, వాసంశెట్టి వెంకట్రావు, ఓలేటి సత్యం ఆధ్వర్యంలో వేద పండితుల పర్యవేక్షణలో ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, హోమం, పూర్ణాహుతి, అనంతరం ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల నడుమ వేద పండితుల ఘనంగా జరిపించారు. తదుపరి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

ఈవీఎంలపై ఉద్యోగులకు శిక్షణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మేరికమ్మ

మామిడికుదురు: ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై మహిళా ఉద్యోగులకు గురువారం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ ఎం.మేరికమ్మ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ పని చేస్తుందన్నారు. దానికి అనుగుణంగానే ఉద్యోగులు కూడా పని చేయాలన్నారు. ఈవీఎంల ఆపరేటింగ్, వీవీ ప్యాట్ల పనితీరుపై మహిళా ఉద్యోగులకు సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఎటువంటి సమస్య ఏర్పడినా వారితో సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ప్రధానంగా శిక్షణ ఇచ్చారు. మండలంలోని 88 మంది మహిళా ఉద్యోగులతో పాటు ఎంఈఓ లక్ష్మీనారాయణ ఈ శిక్షణలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

పి.గన్నవరం: ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించుకుని కచ్చితంగా పాటించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పీఓలు, ఏపీఓలు, ఎన్నికల విధుల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై ఆయన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నియమావళి, చాలెంజ్ ఓటు, టెండర్ ఓటు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. తహసీల్దార్లు ప్రమద్వార్, ఎం.మేరికమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ దేవళ్ల శ్రీనివాస్, డీటీ బి.గోపాలకృష్ణ, ఎంఈఓ కోన హెలీనా తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ ద్వారా అద్భుత విద్యా బోధన



సదస్సులో మాట్లాడుతున్న సైన్స్ విభాగాధిపతి జగదీష్

మలికిపురం: తరగతి గదిలో అధ్యయనంతో పాటు అంతర్జాలం ద్వారా అద్భుతమైన విద్యా బోధనా అవకాశాలు అపారంగా ఉన్నాయని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి కె.జగదీష్ పేర్కొన్నారు. మలికిపురం కళాశాలలో లైబ్రరీ విభాగం ఏర్పాటు చేసిన గెస్ట్ లెక్చర్‌లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆధునిక బోధనా ప్రక్రియలో ఎస్-లిస్ట్, స్వయం, మూక్స్, ఎన్‌డీఎల్ తదితర సాధనాల ద్వారా అంతర్జాతీయ స్థాయి కోర్సులను ఉచితంగా ఇంటి వద్ద నుంచే చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోరం సతీష్, ఆనంద మహేని, లైబ్రరీ విభాగాధిపతి మల్లికార్జునరావు, విజయ్, చిట్టాల సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



పినపళ్లలో రైతులను కలసి అభిప్రాయాలను తెలుసుకుంటున్న వ్యవసాయశాఖాధికారులు

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, జొన్నాడ, పినపళ్ల, పెదపళ్ల గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం పర్యటించింది. రబీ సాగుపై రైతులను అభిప్రాయాలను తెలుసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. సీజన్‌లో సంభవిస్తున్న వివిధ తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అధిక దిగుబడి, పెట్టుబడి ఆదాకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రైతులకు ఆర్బీకేల ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలను, గిట్టుబాటు ధరను కల్పిస్తున్న విధానాన్ని వివరించారు. వరిసాగు ఈనిక దశలో ఉన్నందున రైతులందరూ ఎప్పటికప్పుడు గ్రామ క్షేత్ర సహాయకుల సూచనలు, సలహాలను స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పంటకోత ప్రయోగాల ద్వారా పంట దిగుబడిని అంచనా వేస్తున్నామన్నారు. ఏడీఏ కె.నాగేశ్వరరావు, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉద్యాన సాగుపై రైతులకు అవగాహన



చెముడులంకలో పర్యటించిన ఉద్యాన విద్యార్థులు

ఆలమూరు: మండలంలోని చెముడులంక, బడుగువానిలంక గ్రామాల్లో ఉద్యాన రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలోని వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న 16 మంది విద్యార్థులు గత రెండు రోజుల నుంచి మండలంలో పర్యటించారు. అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌బీవీ చలపతిరావు ఈ బృందానికి నాయకత్వం వహించగా సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, దూలం వెంకటలక్ష్మి సహాయ సహకారాలను అందించారు. విద్యార్థులు ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే ఉద్యాన పంటల్లో రైతులు ఆచరించే సేద్య పద్ధతులను క్షేత్రస్థాయిలో నేర్చుకోవడంలో పాటు రైతులతో మమేకమై ఆధునిక శాస్త్ర పద్ధతులను రైతులు అనుసరించే విధంగా చైతన్యవంతం చేశారు. అలాగే గ్రామీణ రైతులు అవలంబిస్తున్న వినూత్న పద్ధతులను తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు వి.గోవర్ధన్‌రావు, ఎం.కల్పన, ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి, ఇసుక తవ్వకాలను నిలిపివేయాలి

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెంలో ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక, మట్టి తవ్వకాలను నిలిపివేయాలని శివాయలంక గ్రామానికి చెందిన పలువురు గురువారం ర్యాంపు వద్ద ఆందోళన నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తవ్వకాల వల్ల తమ గ్రామం నదీపాతానికి గురవుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. విలువైన లంక భూములు నదీగర్భంలో కలసిపోతాయని వివరించారు. తక్షణమే తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పుచ్చకాయల సాయిబాబు, ఉప్పు భాస్కరరావు పి.సత్యనారాయణ, ఏడుకొండలు, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు విప్పర్తి పరామర్శ

మామిడికుదురు: భార్య వియోగంతో బాధపడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు గురువారం పరామర్శించారు. రాంబాబు భార్య కృష్ణవేణి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. రాంబాబును ఓదార్చి సానుభూతిని తెలియజేశారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పలువురు టీడీపీ, జనసేన నేతలు రాంబాబును పరామర్శించారు.

పొగమంచు... రైతుల గుండెల్లో దడ



గంగలకుర్రులో వరిచేలో కురుస్తున్న మంచు

అంబాజీపేట: పొగమంచు దట్టంగా ఆవరిస్తోంది. శీతాకాలం ప్రవేశించిన తర్వాత రెండ్రోజులుగా అత్యధికంగా మంచు కురుస్తోంది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో 21 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గమనార్హం. ఈ నేపథ్యంలో దట్టంగా పొగమంచు ఆవరిస్తోంది. దీంతో వరి పంట రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 22,384, కొత్తపేట నియోజకవర్గంలో 18,322, రాజోలు నియోజకవర్గంలో 9,387 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. 70 శాతం నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం వరి వివిధ దశల్లో ఉంది. మంచు వల్ల వరి నాట్లు ఎదుగుదలను కోల్పోవడం, మొవ్వ తెగులు ఆశించడంతో పాటు పిలకలు వేసే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మంచు అధికంగా కురవడం వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా శీతాకాలంలో 22 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. ఈ ఏడాది 19 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో మంచు విపరీతంగా కురుస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు ఈ విధంగా పడిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తుండటంతో వరిలో ఎదుగుదల తగ్గుతుందని మొవ్వ తెగులు, పిలకలు వేయకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని అంబాజీపేట వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ఎండ పెరిగిన తర్వాత వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులు పిచికారీ చేయాలన్నారు. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు, లేదా క్లోరాపైడాపాస్ 20 ఈసీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

బ్యాంకులపై అవగాహన ఏర్పరచుకోవాలి

కొత్తపేట: బ్యాంకులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) శ్యాంబాబు సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకూ 'ఫైనాన్సియల్ లిటరసీ వీక్' పురస్కరించుకుని రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాంకింగ్ ఆర్థిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'కాన్వర్డ్ ఈవెంట్' నిర్వహించారు. దీనిలో 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌డీఎం శ్యాంబాబు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈవెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు యూనియన్ బ్యాంకు వారు బహుమతులు అందజేశారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కొత్తపేట/అంబాజీపేట: ఇంటర్మీడియెట్ తుది పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమై ఈ నెల 18 వరకూ జరగనున్నాయి. ఆ మేరకు బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తపేటలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిదద్ధార్థ జూనియర్ కళాశాలల్లో ఎగ్జామ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వాహణలో నియమ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్ష సమయమని, 8.30 గంటలకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.